# మేడిగడ్డపై ముప్పేట దాడి!



నీటి కుట్రలు.. మళ్లీ మొదలు

▸ మొదటిపేజీ తరువాయి...

ఆధీనంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఏడాది క్రితం తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులను అడిగిన వివరాలు. ఈ వివరాలన్నీ నీటిపారుదల శాఖ రికార్డుల్లో దశాబ్దాల తరబడి భద్రంగా ఉన్నాయి. అయినా, కేంద్రానికి ఆ వివరాలు ఎందుకు ఇవ్వడం లేదు? ఎన్‌డీఎస్‌ఏ అధికారులు ఆ బాధ్యతను రాష్ట్రం మీదనే ఉంచి ఎందుకు చేతులు దులుపుకుంటున్నారు? ఎందుకంటే, ఎన్‌డీఎస్‌ఏ అడిగిన వివరాలన్నీ ఇస్తే తుది నివేదిక వస్తుంది. తద్వారా కాళేశ్వరం బరాజ్‌లు వినియోగంలోకి వస్తాయి. కేసీఆర్ కట్టిన బృహత్తర ప్రాజెక్టుతో తెలంగాణ రైతాంగం బాగుపడుతుంది. ఇది జరగకూడదనేదే బరాజ్‌లను ఎండబెట్టడం వెనక అసలు కుట్ర. అందుకే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి వివరాలు ఇవ్వదు. కేంద్రంలోని బీజేపీ సర్కారు తుది నివేదిక అందించదు. ఇదే సమయంలో ఏపీ సీఎం చంద్రబాబు గోదావరి-బనకచర్ల లింకును తెరపైకి తెస్తారు. యాదృశ్చికమో... ఉద్దేశపూర్వకమో... కారణమేదైనా! ఏడాదికిపైగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు మేడిగడ్డపై ముప్పేట దాడిని తలపిస్తున్నాయి. బరాజ్ కుంగుబాటు తెరపైకి వచ్చినప్పుడు గంటల వ్యవధిలోనే ఉరుకులు పరుగులు పెట్టిన ఎన్‌డీఎస్‌ఏ 15 నెలలు గడుస్తున్నా నేటికీ తుది నివేదిక ఇవ్వడం లేదు. ఇదేమంటే, తెలంగాణ నీటిపారుదల శాఖ అడిగిన వివరాలు ఇచ్చిన రెండు నెలల్లోనే ఇస్తామంటది. మరి... ఆ వివరాలేమైనా క్లిష్టతరమైనవా? అంటే కాదని నిపుణులు చెప్తున్నారు. ఏడాదికిపైగా సాగుతున్న హైడ్రామాతో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ-అన్నారం-సుందిల్ల బరాజ్‌లు ఎండుతున్నాయి. తెలంగాణకు ప్రాణాధారమైన ప్రాణహిత జలాలు దిగువకు పరుగులు పెడుతున్నాయి. యాసంగిలో తెలంగాణ రైతాంగం సాగునీటి కోసం అరిగోస పడుతున్నది.

### మూడు బరాజ్‌లను కాలగర్భంలో కలిపే కుట్రలు

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల వినియోగంలో తెలంగాణ దశ-దిశ మారిందనేందుకు 2019 నుంచి రాష్ట్రంలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణమే ఉదాహరణ. దశాబ్దాలుగా తెలంగాణ బీడు భూములకు అందకుండా దిగువకు పరుగులు పెడుతున్న ప్రాణహిత జలాలను రైతులకు అందించడంతోపాటు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా పదేండ్లలో ఏకంగా వందల టీఎంసీల కొద్ది నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు ఒక అస్త్రంలా ఉపయోగపడింది. కానీ, దురదృష్టవశాత్తు మేడిగడ్డ బరాజ్‌లోని 20వ పిల్లర్ కుంగుబాటునకు గురైంది. ఆ ఒక్క సమస్యను ఆసరాగా చేసుకొని కాంగ్రెస్-బీజేపీ రాజకీయ లబ్ధికి దానిని వాడుకోవడమే కాకుండా మూడు బరాజ్‌లను కాలగర్భంలో కలిపేందుకు ప్రయత్నిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఏడాదికిపైగా చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలే ఇందుకు బలాన్నిస్తున్నాయి. మేడిగడ్డ పిల్లర్ కుంగినప్పుడు మరుసటి రోజే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాయగా, ఆ మరుసటి రోజే ఆగమేఘాల మీద రాష్ట్రానికి వచ్చిన నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు క్షేత్రస్థాయి అధ్యయనం చేయకుండానే ప్రాథమిక నివేదిక ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్-బీజేపీ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు రాజకీయ యాత్ర చేశారు. రాహుల్‌గాంధీ సైతం హెలికాప్టర్‌లో మేడిగడ్డను సందర్శించారు. ఆపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కేంద్ర జల సంఘం చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఏర్పాటైంది. ఒకవైపు నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, మరోవైపు ఎన్‌డీఎస్‌ఏ అధికారులు కాళేశ్వరం పరిధిలో అనేకసార్లు పర్యటించి పరిశీలన చేశారు. అధ్యయనాలు కొనసాగించారు. పరీక్షలు చేపట్టారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్లతో ఎన్‌డీఎస్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ పదుల సంఖ్యలో సమావేశాలు నిర్వహించింది. జలసౌధలో మేధోమథనం నిర్వహించారు. తుది నివేదిక మాత్రం బయటికి రావడం లేదు.

### బలిపీఠంపైకి మూడు బరాజ్‌లు

మేడిగడ్డ బరాజ్‌లో ఒక్క పిల్లర్ కుంగుబాటుకు గురైతే, ఆపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త అధ్యయనంలో మూడు బరాజ్‌లను బలిపీఠంపైకి ఎక్కించారు. సీపేజీలు, లీకేజీలు అంటూ మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిల్ల బరాజ్‌లనూ ఖాళీ చేయించి ఎండబెట్టారు. అప్పటినుంచి మూడు బరాజ్‌ల వద్ద పరీక్షల కోలాహలమే తప్ప వాటిని వినియోగంలోకి తీసుకురావాలనే చిత్తశుద్ధి కనిపించడం లేదు. బరాజ్‌లను ఎండబెట్టి ఇసుకను తోడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించడం గమనార్హం. ఈ నేపథ్యంలో గత ఏడాది నవంబర్‌లో ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ సభ్య కార్యదర్శి చైర్మన్ అయ్యర్‌కు రాసిన లేఖ... ఆపై చైర్మన్ వాటిని జోడిస్తూ తెలంగాణ నీటిపారుదల శాఖకు రాసిన లేఖతో అసలు గుట్టు బయటపడింది. వాస్తవానికి ఎన్‌డీఎస్‌ఏ అధికారులు మేడిగడ్డకు సంబంధించి 12, అన్నారం,సుందిల్లకు సంబంధించి ఏడేసి అంశాలపై తెలంగాణ నీటిపారుదల శాఖ నుంచి వివరాలు కోరారు. అందులో కేవలం ఏడు అంశాలకు సంబంధించి ఇప్పటికీ (దాదాపు ఏడాది కాలంగా) వివరాలు ఇవ్వలేదని నిపుణుల కమిటీ పేర్కొన్నది. అయితే, ఆ ఐదు అంశాలకు సంబంధించిన వివరాలు చాలా సులువైనవిగా ఇంజినీరింగ్ నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా మూడు బరాజ్‌ల దగ్గర ఎగువ, దిగువ స్ట్రీమ్‌లకు సంబంధించిన వరద (గేజ్ అండ్ డిశ్చార్జి) వివరాలు ఉన్నాయి. ఈ వివరాలు నీటిపారుదల శాఖ రికార్డుల్లో ఎలాగూ ఉన్నాయి. కానీ, వాటిని ఎన్‌డీఎస్‌ఏకు ఎందుకు ఇవ్వడంలేదనేది విస్మయం కలిగిస్తున్నదని రిటైర్డ్ ఇంజినీర్ ఒకరు అన్నారు. ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టు సర్వే దశలో కేసీఆర్ ప్రభుత్వం గోదావరి-ప్రాణహిత-ఇంద్రావతి ఇలా ఆద్యంతం లైడార్ సర్వే చేపట్టింది. ఒక సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి లైడార్ సర్వే చేపట్టడం దేశంలోనే మొదటిసారి. అత్యంత అధునాతనమైన లైడార్ సర్వే వివరాలు నీటిపారుదల శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయి. ఇందులో నుంచి ఎన్‌డీఎస్‌ఏ అడిగిన వివరాలు సులువుగా ఇచ్చే అవకాశం ఉన్నది. కానీ, ఈ వివరాలు ఇవ్వనందుకే తాము తుది నివేదిక ఇవ్వలేకపోతున్నామని నిపుణుల కమిటీ చెప్పడం, వాటిని ఇచ్చిన రెండు నెలల్లోనే తుది నివేదిక ఇస్తామని స్పష్టంచేయడం, ఇదే సమయంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఆ వివరాలు సమర్పించకపోవడంతో ఉద్దేశపూర్వకంగానే 'బరాజ్‌లను బలిపీఠంపై నిలిపారు' అనే అనుమానాలకు బలాన్నిస్తున్నాయి.

### ఇది మరో విడ్డూరం

మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించకుండా ప్రాణహిత జలాలను దిగువకు వదులుతున్న నేపథ్యంలో గత ఏడాది యాసంగిలో తెలంగాణ రైతాంగం సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో తాత్కాలిక ఏర్పాట్లతోనైనా కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలనే డిమాండ్ వచ్చింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ససేమిరా అన్నది. 'ఎవరి మాటలూ వినం.. న్‌డీఎస్‌ఏ ఆదేశాలు, సూచనలు మాత్రమే అమలుచేస్తాం' అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనేక సందర్భాల్లో కుండబద్దలు కొట్టారు. కానీ, ఎన్‌డీఎస్‌ఏ కమిటీ నీటిపారుదల శాఖకు రాసిన లేఖలో ఇదంతా ఒట్టి బూటకం అని తేలిపోయింది. అదేమంటే...

- మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించి ఏడో బ్లాక్‌లో రాఫ్ట్ జియోటెక్నికల్ (అంటే ఆ బ్లాకు వద్ద ఉన్న మట్టిని బోరింగ్ ద్వారా తీసి ఆ మట్టి గుణగణాలు-పటుత్వం ఎలా ఉన్నాయో తెలిపే పరీక్ష) అంశానికి సంబంధించి నీటిపారుదల శాఖ ఇంజినీర్లు పరీక్షలు నిర్వహించడంతో క్షేత్రస్థాయిలో వాస్తవ స్థితి మారిపోయిందని (గ్రౌండ్ కండిషన్ ఆల్టర్డ్) ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇంజినీర్లు అక్కడ గ్రౌటింగ్ పనులు చేపట్టడంతో ఇక తాము ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయాన్ని కమిటీ చెప్పినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో 'ఎన్‌డీఎస్‌ఏ ఏం చెప్తే అదే చేస్తాం' అన్న ప్రభుత్వం ఈ పరీక్షలు ఎవరు చెప్తే చేశారు? ఎన్‌డీఎస్‌ఏ కమిటీనే సూచించినట్టయితే అభ్యంతరం ఎందుకు వ్యక్తంచేస్తున్నది? ఒకవేళ కమిటీ సూచించనట్టయితే నీటిపారుదల శాఖ ఇంజినీర్లు ఎందుకు చేశారు? అసలు కమిటీ-నీటిపారుదల శాఖ మధ్య సమన్వయం లేకుండా అధ్యయనం కొనసాగడమంటే తెర వెనక ఏం జరుగుతున్నది? అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.
- ఇదే రీతిన అన్నారం, సుందిల్ల బరాజ్‌ల వద్ద కూడా నీటిపారుదల శాఖ ఇంజినీర్లు చేసిన పరీక్షలపై కమిటీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసే రీతిలో ఆ పరీక్షలు ఎందుకు నిర్వహించారనేది పలు అనుమానాలకు తావిస్తున్నది.

## దేవాదుల వద్ద సాధ్యమైంది... ఇక్కడ కాదా?

ప్రాణహిత జలాలను ఎత్తిపోసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ బరాజ్ పిల్లర్ కుంగుబాటును సాకుగా చూపుతున్నది. నిరుడు చుక్కనీటిని కూడా ఎత్తిపోయలేదు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రానున్న సీజన్‌లోనూ నీటిని ఎత్తిపోయకుండా ఉండేందుకే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నది. ఈ క్రమంలో నీటిని ఎత్తిపోతల నిలిపివేతకు బరాజ్ కారణమైతే, దేవాదుల వద్ద ఏ బరాజ్ ఉన్నదని నీటిని ఎత్తిపోస్తున్నారు? అని పలువురు నిపుణులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేవాదుల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆపై వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞం కింద ఆ ప్రాజెక్టును చేపట్టి పనులు నిర్వహించింది. గోదావరిలో 71 మీటర్ల ఎత్తులో నీటి ప్రవాహం ఉన్నప్పుడు జలాలను మళ్లించేందుకు ఇన్‌టేక్ వెల్ (ఒక చిన్న బావి)లోని నీటిని మోటర్ల ద్వారా ఎత్తిపోసేలా దేవాదుల డిజైన్ చేశారు. బరాజ్ లేకుండానే చిన్నబావి ఏర్పాటు ద్వారా నీటిని మళ్లిస్తున్నారు. అలాంటప్పుడు మేడిగడ్డ బరాజ్‌తో సంబంధం లేకుండా కన్నెపల్లి వద్ద ఇన్‌టేక్‌వెల్‌ను ఏర్పాటుచేసి ప్రాణహిత జలాలను ఎత్తిపోసేందుకు అవకాశం ఉన్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వాస్తవాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నది. మేడిగడ్డలో ఒక పిల్లర్ కుంగుబాటుకు గురైందే తప్ప అన్నారం, సుందిల్ల బరాజ్‌ల వద్ద సమస్య లేదనేది బహిరంగ రహస్యం. కానీ, మేడిగడ్డ మాటున ప్రభుత్వం ఈ రెండు బరాజ్‌లను కూడా బలిపీఠంపై పెట్టి ప్రాణహిత జలాల ఎత్తిపోతల ప్రక్రియను విస్మరిస్తున్నది.

## ఇదీ సంగతి

**2023 అక్టోబర్ 21:** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ వద్ద 20వ పిల్లర్ కుంగుబాటునకు గురైంది.

**2023 అక్టోబర్ 22:** ఈ ఘటనపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)కు లేఖ రాశారు.

**2023 అక్టోబర్ 23:** ఆగమేఘాలపై ఎన్‌డీఎస్‌ఏ అధికారులు హైదరాబాద్‌కు చేరుకున్నారు.

**2023 అక్టోబర్ 24:** ఎన్‌డీఎస్‌ఏ అధికారులు హైదరాబాద్ నుంచి మేడిగడ్డ బరాజ్ మీదనే ఉండి పరిశీలన చేశారు.

**2023 అక్టోబర్ 29:** కనీసం ఎలాంటి పరీక్షలు, కనీస అధ్యయనం లేకుండానే 'ఇది డిజైన్, నాణ్యత లోపం' అంటూ ఎన్‌డీఎస్‌ఏ ప్రాథమిక నివేదిక ఇచ్చింది. ఈ నివేదికను అడ్డం పెట్టుకుని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-బీజేపీ రాజకీయ లబ్ధి పొందేందుకు ఒకే రాగాన్ని ఆలపించాయి. ఆపై మార్చి వరకు ఎన్‌డీఎస్‌ఏ నుంచి ఉలుకూపలుకూ లేదు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మళ్లీ హడావుడి చేశారు. గత ఏడాది మార్చిలో ఎన్‌డీఎస్‌ఏ ఇంజినీర్లతో నిపుణుల కమిటీ వేసి, అదే నెలలో వరుస పర్యటనలు చేపట్టారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కేవలం ఉత్తర ప్రత్యుత్తరాలు తప్ప ఎలాంటి హడావుడి లేదు. ఘటన జరిగి 15 నెలలు అవుతున్నది. కానీ, ఇప్పటివరకు బరాజ్‌ల పునరుద్ధరణపై ఎన్‌డీఎస్‌ఏ ఒక కార్యాచరణ ఇచ్చింది లేదు.. నివేదిక కోసం రాష్ట్ర ప్రభుత్వం పట్టుబట్టిందీ లేదు.



## సెక్షన్ 3 ఏర్పాటు బీఆర్‌ఎస్ విజయం

- కాంగ్రెస్ వల్లే కృష్ణా జలాల్లో అన్యాయం
- ఆదిత్యనాథ్‌దాస్‌ను తక్షణం దూరం పెట్టాలి
- సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, జనవరి18 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అవిశ్రాంత పోరాటం ఫలితంగానే కేంద్రం దిగొచ్చి సెక్షన్-3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీకి ముందుకొచ్చిందని, నేడు ట్రిబ్యునల్‌లో ఆ దిశగానే వాదనలు కొనసాగేందుకు అవకాశం ఏర్పడిందని సామాజిక కార్యకర్త, ఎన్జీటీ పిటిషనర్ గవినోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్- 89 ప్రకారం ప్రాజెక్టుల వారీగా నదీజలాల పంపిణీని తెలంగాణ ఉద్యమం, కేసీఆర్ సర్కార్ మొదటి నుంచీ వ్యతిరేకించినట్టు గుర్తుచేశారు. తెలంగాణకు న్యాయం జరగాలంటే, అంతర్రాష్ట్ర నదీజలాల చట్టం 1956 సెక్షన్-3 ప్రకారం నదీజలాలను పునఃపంపిణీ చేయాలని కేసీఆర్ పట్టుబట్టారని, రాష్ట్ర ఏర్పాటు తరువాత సెక్షన్ 3 కోసం ఎంతో పోరాటం చేశారని కొనియాడారు. ఈ అంశాన్ని కేంద్రం నాన్చడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు సైతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెళ్లిందని తెలిపారు. ఆ తరువాతే కేంద్రం స్పందించిందని, కేసు వాపస్ తీసుకుంటే సెక్షన్-3 ప్రకారం ట్రిబ్యునల్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చిందని వివరించారు. కేంద్రం సూచనతో సుప్రీంకోర్టులో పిటిషన్ వాపస్ తీసుకున్నారని, తదనంతరమే కేంద్రం బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు నూతన మార్గదర్శకాలను జారీచేసిందని వెల్లడించారు. ఇది ముమ్మాటికీ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, తెలంగాణ సమాజం విజయమని గవినోళ్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఎన్జీటీ ఆదేశాలను ధిక్కరించి పోతిరెడ్డిపాడు ద్వారా అక్రమంగా నీటి తరలింపునకు తీవ్రంగా కృషి చేసి, ట్రిబ్యునల్‌తో జైలుకు పంపాల్సి వస్తుందని చివాట్లు తిన్న నాటి ఏపీ నీటిపారుదల కార్యదర్శి, అప్పటి ఏపీ సీఎస్ ఆదిత్యనాథ్‌దాస్‌నే, తిరిగి ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర నీటిపారుదలశాఖ సలహాదారుడిగా కాంగ్రెస్ సర్కార్ నియమించిందని, ఇంతకంటే ఘోరం మరేమీ ఉండబోదని దుయ్యబట్టారు. రెండేండ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ కోసం పనిచేసిన వ్యక్తి, ఇప్పుడు తెలంగాణ తరపున ఉండటం వైచిత్రమని విమర్శించారు. ట్రిబ్యునల్ ఎదుట ఎలా బలమైన వాదనలు వినిపిస్తాడని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆదిత్యనాథ్‌దాస్‌ను తొలగించాలని, లేదంటే కనీసం ట్రిబ్యునల్ వాదనలకు దూరం పెట్టాలని డిమాండ్ చేశారు. చేసిన తప్పులను సరిదిద్దుకొని, ట్రిబ్యునల్ ఎదుట బలమైన వాదనలు కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించాలని, కృష్ణా నీటి వాటా 50 శాతాన్ని సాధించాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు.

## గోదావరి-బనకచర్ల లింకు అసలు లక్ష్యమేంటి?

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వెనక అసలు ఉద్దేశం.. ప్రధాన గోదావరిపై ఉన్న శ్రీరాంసాగర్‌కు ఏడాది పొడవునా ఇన్‌ఫ్లోలు ఉండవు. బాబ్లీ నుంచి భారీ వరద ఉన్నా అది వర్షాకాలానికే పరిమితం. శ్రీరాంసాగర్‌లో సామర్థ్యానికి అనుగుణంగా నిల్వ చేసుకొని ఆపై మిగిలిన వరదను దిగువకు వదలాల్సిందే. గరిష్ఠంగా 10-15 రోజులే ఈ పరిస్థితి ఉంటుంది. దీంతో యాసంగికి శ్రీరాంసాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించడం కాళేశ్వరం అందుబాటులోకి వచ్చేదాకా ఒక సవాల్‌గా ఉండేది. 2019 తర్వాత ఎస్సారెస్పీ నుంచి దిగువన సూర్యాపేట దాకా రెండు పంటలకు పుష్కలంగా సాగునీటిని అందించిన చరిత్ర ఉన్నది. కేవలం గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంను పక్కకుపెట్టడంతో తిరిగి యాసంగిలో పంటలు ఎండిపోయాయి. ఈ దుస్థితికి శాశ్వత పరిష్కారంగానే కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టింది. ప్రాణహితలో సీజన్‌లో లక్షల క్యూసెక్కుల వరద రావడమే కాదు... మండు వేసవిలోనూ అక్కడ కనిష్ఠంగా 5-10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోలు నమోదవుతాయి. అందుకే కేసీఆర్ హయాంలో మే నెలలోనూ కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసిన దాఖలాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తెరపైకి తెచ్చిన గోదావరి-బనకచర్ల అసలు లక్ష్యంగా ఇదేననే సందేహాలు సాగునీటి రంగ నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. చంద్రబాబు ఇటీవల ఇచ్చిన ప్రజంటేషన్ సందర్భంగా నాలుగు వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని, వాటిని వినియోగించుకునేందుకే ఈ లింకు ప్రాజెక్టు అని చెప్పారు. కానీ, గోదావరిలో వరద డైనమిక్‌గా ఉంటుందని రిటైర్డ్ ఇంజినీర్ ఒకరు చెప్పారు. రోజుల వ్యవధిలోనే వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తాయి. చంద్రబాబు చెప్తున్న నాలుగువేల టీఎంసీల్లో 80-90% వరద రెండు నెలలకే పరిమితమవుతుంది. మిగిలిన 10-20 శాతమే అన్‌సీజన్‌లో దిగువకు పోతుంది. ఆ కొద్దిపాటి పరిమాణమే పంటలకు ప్రాణాధారంగా నిలుస్తుంది. వర్షాకాలంలో వచ్చే భారీ వరదను ఒడిసిపట్టడం అసాధ్యం. పైగా వర్షాకాలంలో నిల్వ సామర్థ్యం మేరకు వరదను ఒడిసిపట్టి, ఆపై దిగువకు వదలాల్సిందే. పోలవరం పూర్తయిన తర్వాత కూడా ఇదే పరిస్థితి. ప్రధానంగా యాసంగి పంటలకు సమృద్ధిగా నీటిని అందించడంతోపాటు వర్షాకాలం పంటలకు ముందుగానే నాట్లు వేసుకునేందుకు సాగునీటిని ఇవ్వడమనేది కీలకమైన అంశాలు. అది ఏడాది పొడవునా ఇన్‌ఫ్లోలు ఉండే ప్రాణహితతోనే సాధ్యమవుతుందని కేసీఆర్ గుర్తించారు. అందుకే ప్రధాన గోదావరిలో వరద నిలిచిపోయినా ప్రాణహితలో నిత్యం వచ్చే ఇన్‌ఫ్లోలను ఎత్తిపోసుకొని ఎప్పటికప్పుడు రిజర్వాయర్లను నింపుకునేలా డిజైన్ రూపొందించారు. కానీ,మేడిగడ్డ బరాజ్‌ను పడావు పెట్టి... కన్నెపల్లి వద్ద ఎత్తిపోతలను అటకెక్కించడంతో ఎండాకాలంలోనూ ప్రాణహితలో వచ్చే కొద్దిపాటి ఇన్‌ఫ్లోలు నేరుగా దిగువకు పోతాయి. ఆ నీటిని లింకు ప్రాజెక్టు ద్వారా మళ్లించుకునేందుకు ఆస్కారముంటుందని సాగునీటిరంగ నిపుణుడు ఒకరు వివరించారు.



## సోలార్ ప్లాంట్లు.. సవాలక్ష సందేహాలు

- స్పష్టతనివ్వని సర్కారు.. మహిళా సంఘాల్లో అయోమయం
- స్కీమ్‌లో గందరగోళంతో ముందుకుసాగని టెండర్ ప్రక్రియ

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన సోలార్ విద్యుత్తు ప్లాంట్లపై స్పష్టతలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పీఎం కుసుమ్ స్కీమ్‌లో భాగంగా రాష్ట్రంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు కల్పించింది. 1000 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటు లక్ష్యంగా ప్లాంట్ల ఏర్పాటుకు టీజీ రెడ్‌కో టెండర్లు ఆహ్వానించింది. కానీ టెండర్ల ప్రక్రియ ముందుకు సాగడంలేదు. బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే పెట్టుబడి రాబట్టుకోవడం కష్టమేనని వాదనలు వినిపిస్తున్నాయి. స్కీమ్‌పై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.


### మహిళా సంఘాలు వ్యక్తంచేస్తున్న సందేహాలు

- ఒక గ్రామంలో 10-12 మహిళా సంఘాలుంటాయి. గ్రామ సమైక్య సంఘాలుంటాయి. ప్లాంట్ల ఏర్పాటు, నిర్వహణ బాధ్యత ఎవరిది?
- మెగావాట్ ప్లాంట్‌కు 4-5 ఎకరాలు భూమి కావాలి. భూముల లీజు ధర ఎంత?
- భూములను చదును చేయడానికి, గుంతలు పూడ్చడానికి అయ్యే ఖర్చు ఎవరు భరించాలి?
- ప్లాంటును గ్రిడ్‌కు అనుసంధానం చేసే ట్రాన్స్‌మిషన్ విద్యుత్తు లైన్ ఏర్పాటు చేయాలంటే కిలో మీటర్‌కు రూ.15లక్షలు ఖర్చవుతుంది. ఈ మొత్తం భరించాల్సింది మహిళా సంఘాలా? డిస్కంలా?
- మెగావాట్ ప్లాంటు ఏర్పాటుకు రూ.3 కోట్లు వ్యయం అవుతుంది. నెలకు 1.40 లక్షల వాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది.
- వాట్‌కు రూ.3.13 చొప్పున రూ.4.5లక్షల వరకు ఆదాయం వస్తుంది. నిర్వహణ వ్యయం రూ.53 వేలు అవుతుంది. ఈ లెక్కన 20 ఏండ్లు దాటినా బ్యాంకు రుణం తీరడం కష్టమేనని సోలార్ అసోసియేషన్ నేతలు అంచనా వేస్తున్నారు.
- సోలార్ ప్యానల్ ధరలు భారీగా పెరిగాయి. ప్లాంట్ల ఏర్పాటులో వీటి భారం సంగతేంటి?
- సోలార్ విద్యుదుత్పత్తిలో ప్యానల్ క్లీనింగ్ కీలకం. ఇందుకు ఒక ప్లాంటుకు 8 మంది సిబ్బంది అవసరం. వీరి వేతనాల భారం వల్ల గిట్టుబాటు అవుతుందా?

## రేపటి నుంచి పోలీసు ఆరోగ్య భద్రత బంద్?

ఇప్పటికే సొంత ఖర్చులతో వైద్యం • బకాయిలపై నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

20 తర్వాత వైద్యం చేయబోమని చెప్పిన దవాఖానలు • ఇబ్బందులు పడుతున్న పోలీసు కుటుంబాలు



హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): పోలీసు ఆరోగ్య భద్రత కింద లభించే వైద్య సేవలు సోమవారం నుంచి పూర్తిగా బంద్ కానున్నాయి. దవాఖానలకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వైద్య సేవలు నిలిచిపోనున్నట్టు తెలుస్తున్నది. తమకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం 20వ తేదీలోపు స్పష్టత ఇవ్వాలని తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఎస్‌హెచ్‌ఏ) జనవరి 6న ఆరోగ్య భద్రత కార్యదర్శికి లేఖ రాసింది. కానీ, ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని పోలీసు ఆరోగ్య భద్రత విభాగం అధికారులు చెప్పారు. ఈ విషయమై ఆరోగ్య భద్రత కార్యదర్శిని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. 'ఏమైనా ఉంటే.. 20వ తారీఖు తర్వాత చెప్తాం.. అప్పుడే రాసుకోండి' అని తేల్చి చెప్పారు.

### ఇప్పటికే సొంత ఖర్చులతో వైద్యం..

- పోలీసు సిబ్బందికి, వారి కుటుంబాలకు ఎంతో కీలకమైన ఆరోగ్య సంరక్షణను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ దవాఖానలకు బకాయిలు చెల్లించకపోవడంతో ఈ పథకం కింద రోగులను చేర్చుకోవడానికి అవి నిరాకరిస్తున్నాయి. ఈ దుర్భర పరిస్థితి పోలీసు సిబ్బందిని ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందుల్లో పడేసింది.
- హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న 47 ఏండ్ల అమరేశ్ (పేరు మార్చాం) హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ దవాఖానలో అర్ధరాత్రి అత్యవసరంగా యాంజియోగ్రఫీ చేయించుకోవడానికి వెళ్లగా.. ఈ పథకం కింద వైద్యం చేయలేమని సిబ్బంది చెప్పారు. దీంతో అతను రూ.30 వేలు చెల్లించి వైద్యం చేయించుకోవాల్సి వచ్చింది.
- గత అక్టోబర్‌లో గుండెపోటుకు గురైన ఏఆర్ ఎస్సై జనార్దన్‌రావును 'గోల్డెన్ అవర్'లో ఓ ప్రముఖ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వారు పోలీసు ఆరోగ్య భద్రత వంక చూపి వైద్యం చేయకుండా వెనక్కి పంపడంతో సమయం మించిపోయి ఆయన చనిపోవడం మరింత బాధించింది.
- ప్రస్తుతం ఏదైనా హెల్త్ ఎమర్జెన్సీతో ఏ దవాఖానకు వెళ్లినా 'పోలీసు ఆరోగ్య భద్రతా?.. దానిపై వైద్యం చేయలేం' అని సిబ్బంది ముఖం మీదే చెబుతుండటంతో ప్రాణాలు దక్కించుకునేందుకు సొంతంగా డబ్బులు పెట్టి వైద్యం చేయించుకుంటున్నారు. కొందరు అప్పు తెచ్చి తమ వారిని కాపాడుకుంటున్నారు.

### ప్రతినెలా నగదు చెల్లిస్తున్నా..

ఉమ్మడి ఏపీలో 1999లో పోలీసు ఆరోగ్య భద్రతను తీసుకువచ్చారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) శాశ్వత ట్రస్టీగా, ఎక్స్-అఫీషియో చైర్మన్‌గా 11 మంది సభ్యులతో ఈ పథకాన్ని నిర్వహిస్తున్నారు. దీనికి ఐజీ (వెల్ఫేర్) స్థాయి అధికారి వైస్ చైర్మన్‌గా ఉన్నారు. దీని నిర్వహణ బాధ్యతలను కార్యదర్శి చూసుకుంటారు. అయితే, 2024 మే నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 202 దవాఖానలు ఈ పథకం కింద ఎంప్యానెల్ చేయబడ్డాయి. ఈ పథకం కింద సభ్యులుగా నమోదైన కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ వరకు రూ.1,600, ఎస్సై నుంచి పై ర్యాంకు అధికారుల వరకు రూ.3200 చొప్పున వారి బ్యాంకు ఖాతా నుంచి ప్రతినెలా కట్ చేస్తారు. ప్రతినెలా నగదు చెల్లిస్తున్నా.. తమవారికి ఆపద వచ్చినప్పుడు వైద్యం చేయించుకోలేకపోతున్నామనే వేదన పోలీసులను కలిచివేస్తున్నది. ప్రభుత్వం తక్షణం స్పందించి బకాయిలు విడుదల చేయాలని పోలీసు కుటుంబాలు వేడుకుంటున్నాయి.

## టీటీడీ తరహాలో యాదాద్రి పాలకమండలి

- వచ్చే క్యాబినెట్‌లో బిల్లు ఆమోదం!
- ఆ తర్వాత ఆర్డినెన్స్ వచ్చే అవకాశం
- ముఖ్యమంత్రి వద్దకు చేరిన దస్త్రం

హైదరాబాద్, జనవరి 18(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తరహాలో పాలకమండలి ఏర్పాటుకానున్నది. ఇందుకు సంబంధించి దేవాదాయశాఖ చట్టంలో స్వల్ప సవరణలు చేయగా, వాటికి న్యాయశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో బోర్డు ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలను ఖరారుచేసిన దేవాదాయ శాఖ.. దస్త్రాన్ని ముఖ్యమంత్రి ముందుంచింది. వచ్చే క్యాబినెట్‌లో ఈ బిల్లును ఆమోదించి ఆర్డినెన్స్ జారీ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది.

### చైర్మన్ సహా 20 మంది వరకు సభ్యులు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో యాదాద్రి ఆలయాన్ని దాదాపు రూ.1200 కోట్లతో అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన, రవాణా కనెక్టివిటీ తదితరాలతో ఆలయానికి భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి ఆలయానికి టీటీడీ తరహాలో పాలకమండలిని ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. వచ్చే క్యాబినెట్‌లో దీనికి ఆమోదం లభిస్తుందని, అనంతరం ఆర్డినెన్స్ ద్వారా పాలకమండలిని అమలుచేస్తారని సమాచారం. పాలకమండలిలో చైర్మన్‌తో సహా 20 మంది వరకు సభ్యులు, మూడేండ్లపాటు పదవీకాలం ఉండనున్నట్టు తెలిసింది.

## రాష్ట్రంలో మరో రెండు ఆర్టీసీ డిపోలు

పెద్దపల్లి, ఏటూరునాగారంలో ఏర్పాటు • ఆరు బస్‌స్టేషన్ల నిర్మాణానికి అనుమతి

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా రెండు డిపోలు, ఆరు బస్‌స్టేషన్ల నిర్మాణంతోపాటు పలు బస్‌స్టేషన్ల విస్తరణకు ఆర్టీసీ బోర్డు అనుమతిచ్చింది. ఈ మేరకు హైదరాబాద్ బస్‌భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయించింది. పెద్దపల్లిలో రూ11.70 కోట్లు, ఏటూరునాగారంలో రూ.6.28 కోట్లతో బస్‌డిపోలను ఏర్పాటు చేయనున్నది. ములుగు జిల్లాకేంద్రంలో రూ.5.11 కోట్లు, అదే జిల్లాలోని మంగపేటలో రూ.51 లక్షలు, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రూ. 3.75 కోట్లు, కోదాడలో రూ. 17.95 కోట్లు, ఖమ్మం జిల్లాలో మధిరలో రూ. 10 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో రూ.3.95 కోట్లతో కొత్త బస్‌స్టేషన్లను నిర్మించనున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని బస్‌స్టేషన్ విస్తరణకు రూ.95లక్షలు కేటాయించారు. కాగా, ఈ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.